సాక్షి ఖమ్మం
గురువారం । 31 । ఆగస్టు । 2023



పోరుబాటలో ఉపాధ్యాయులు

సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఉపాధ్యాయులు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు సిద్ధమవుతున్నారు. 10లో



...రెగ్యులర్ చేస్తాం

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేస్తామని ఆ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
35° / 24°

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో రక్షాబంధన్



జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం రక్షా బంధన్ మహోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సృష్టిలో అన్నాచెల్లెళ్ల బంధం ఎంతో గొప్పదని తెలిపారు. అనంతరం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బాధ్యులు జిల్లా జడ్జికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మన్నెపల్లి బసవయ్యతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి 32 మంది సీనియర్ రెసిడెంట్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి 32 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులను కేటాయించారు. వివిధ ప్రత్యేక విభాగాల్లో పీజీ వైద్యవిద్య పూర్తిచేసిన వారు ఏడాది పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలనే నిబంధన ఉంది. ఈ నేపథ్యాన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి 32 మందిని ఖమ్మం మెడికల్ కాలేజీకి కేటాయించారు. ఈమేరకు స్పెషలిస్ట్ వైద్యులు వస్తుండడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో మరింత నాణ్యమైన వైద్య సేవలందనున్నాయి. కాగా, వీరు సెప్టెంబర్ 1 నుండి 5వ తేదీ లోపు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

జమలాపురంలో గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షణలో పాల్గొన్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల సమేతంగా వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై గిరి ప్రదక్షిణ చేశారు. గోవిందనామ స్మరణ చేస్తూ అర్చకులు, సిబ్బంది, భక్తులు ఈ పూజలు జరిపించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, వేదపండితులు అనంతశయనాచారి, వసంత్‌కుమార్, సాయిఅభిలాష్, అర్చకులు రాజీవ్‌శర్మ పాల్గొన్నారు.

1,023 దరఖాస్తులు !

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం మెడికల్ కాలేజీలో వివిధ పస్తుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా భారీగా స్పందన లభించింది. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ అర్హతతో 32 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తు గడువు బుధవారం ముగిసే సమయానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కలిపి 1,023 దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. విద్యార్హతలు, ప్రతిభ ఆధారంగా ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు ఆధ్వర్యాన మెరిట్ జాబితా రూపొందించనున్నారు. అనంతరం జాబితాను కలెక్టర్‌కు సమర్పించి రెండు, మూడు రోజుల్లో అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశముంది.

విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలి




ఉపాధ్యాయ శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ

వైరా/కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రైవేట్‌కు దీటుగా ఉన్నత విద్యనందించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొణిజర్ల మండలం తనికెళ్లలోని గ్రేస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఉన్నతి, లక్ష్య శిక్షణ తరగతుల్లో బుధవారం ఆయన మాట్లాడారు. పాఠశాలలోని తరగతి గదుల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఎంఈఓలు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మోదుగు శ్యాంసన్‌తో పాటు నోడల్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు రంగారెడ్డి, వి.శ్రీనివాసరావు, డి.పుల్లయ్య, రామనాథం, రవికుమార్, జగదీష్, శ్రీనివాసరావు, సుచరిత, రామానుజచార్యులు, కృష్ణ, నాగేశ్వరరావు, సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ.. సారథులు

ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను ప్రకటించడం ద్వారా బీఆర్‌ఎస్ ఎన్నికల కార్యక్షేత్రంలోకి దిగినట్లయింది. అయితే, పలు నియోజవర్గాల్లో అసమ్మతి జ్వాలలు రగులుతున్నా అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారంలో నిమగ్నమయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తిచేయించడంపై దృష్టి సారించగా.. మిగిలిన అభ్యర్థులు.. నేతలు, కేడర్‌ను కలుస్తూ గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇంతలోనే పార్టీ అధిష్టానం నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించింది. వీరు అక్కడ నేతలు, కేడర్‌ను సమన్వయం చేయనున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



బీఆర్‌ఎస్‌లో నియోజకవర్గానికో ఇన్‌చార్జి

- నేతలు, కేడర్‌ను సమన్వయం చేసేలా బాధ్యతలు
- రంగంలోకి మంత్రితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీ
- త్వరలోనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యాచరణ

గత ఫలితాలు పునరావృతం కాకుండా...

తెలంగాణ ఏర్పడ్డాక ఇప్పటివరకు రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఒక్కో స్థానంతోనే బీఆర్‌ఎస్ సరిపెట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు మెజార్టీ స్థానాలు వచ్చినా ఉమ్మడి ఖమ్మంలో మాత్రం చతికిలబడింది. ఆతర్వాత కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరడంతో పార్టీ ప్రాతినిధ్య బలం పెరిగింది. ఈనేపథ్యాన గత ఫలితాలు పునరావృతం కాకుండా పార్టీ అధిష్టానం ఈసారి ఉమ్మడి జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు చేసిన అభివృద్ధిపై నియోజవర్గాల వారీగా బుక్‌లెట్లు సిద్ధం చేస్తున్నారు. బరిలో ఉండే అభ్యర్థుల ద్వారా గడపగడపకు వీటిని పంపిణీ చేయించనున్నారు. ఉమ్మడి జిల్లాకు ఒక మంత్రి పదవితో పాటు ముగ్గురు ఎంపీలు, ఎమ్మెల్సీ ఉండడం, సిట్టింగ్‌లనే అభ్యర్థులుగా ప్రకటించిన నేపథ్యాన మెజార్టీ స్థానాల్లో విజయం దిశగా పార్టీ అధిష్టానం నజర్ పెట్టగా... పలు నియోజకవర్గాలకు ముఖ్యలను ఇన్‌చార్జ్‌లుగా నియమించింది.

ఎవరెవరు... ఎక్కడ..

అభ్యర్థులను ప్రకటించాక సీఎం కేసీఆర్ పలు దఫాలుగా అభ్యర్థులు, ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ చర్చల సందర్భంగా సీఎం కేసీఆర్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలిసింది. మధిర నియోజకవర్గానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, భద్రాచలానికి ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఎంపీ నామా నాగేశ్వరరావు, సత్తుపల్లికి ఎంపీ బండి పార్థసారథిరెడ్డి ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. ఇదే సమయాన ఖమ్మం, పాలేరు, పినపాక నియోజకర్గాల బాధ్యతలను మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్ రెడ్డి, రేగా కాంతారావు నిర్వర్తించనున్నారు.

కార్యోన్ముఖులను చేసేలా..

కేసీఆర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఇన్‌చార్జ్‌లు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపునకు కలిసొచ్చే అంశాలపై కసరత్తు మొదలుపెట్టారు. ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు, క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధుల్లో అసంతృప్తిగా ఉన్న వారి వివరాలు ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. అలాగే, నేతలు, కేడర్‌ను ఎన్నికలను సిద్ధం చేయడంపై దృష్టి సారించారు. అసంతృప్తులను బుజ్జగించడం, అభ్యర్థులు, నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతూ సూచనలు, సలహాలు ఇవ్వడమే కాక... ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు సేకరిస్తారు. ఆపై నియోజకవర్గ పరిస్థితులను ఎప్పటికప్పుడు అధిష్టానానికి వీరు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. తద్వారా లోటుపాట్లు ఉంటే సరిదిద్దేలా అధిష్టానం ఇచ్చిన సూచనలతో ముందుకెళ్లనున్నారు. అలాగే, నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీల బలాబలాలను గుర్తించి వారు ఎన్నికల్లో అనుసరిస్తున్న వ్యూహాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ పార్టీలో అసమ్మతికి తావులేకుండా చూడాలని ఇన్‌చార్జిలకు సూచనలు అందినట్లు తెలిసింది. కాగా, రెండు రోజుల్లో సమన్వయ సారథుల కార్యాచరణ మొదలుకానుంది.

బోధనకు సిద్ధం చేయండి

- మెడికల్ కాలేజీలో పరిశీలించిన కలెక్టర్ గౌతమ్
- రేపటి నుంచి తరగతులు ప్రారంభించనున్నట్లు వెల్లడి



డబుల్ బెడ్‌రూం సముదాయంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శుక్రవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఈ నేపథ్యాన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కళాశాలను బుధవారం పరిశీలించిన ఆయన లెక్చర్ హాళ్లు, హాస్టళ్లను త్వరగా సిద్ధం చేయాలని తెలిపారు. శుక్రవారం నుంచి మొదలయ్యే తరగతులకు హాజరయ్యేందుకు గురువారమే విద్యార్థులు వచ్చే అవకాశముందని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ హాస్టల్‌లో చేరేలా స్థానికేతర విద్యార్థులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, అధికారులు ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మాణంలో వేగం పెంచండి

ఖమ్మంఅర్బన్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచి త్వరగా లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. ఖమ్మం అల్లీపురం, వైఎస్సార్ నగర్‌లో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పురోగతిని ఆయన పరిశీలించి మాట్లాడారు. పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తయ్యేలా అదనపు వనరులు సమకూర్చుకోవాలని చెప్పారు. కాగా, ఖమ్మం మయూరిసెంటర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. రిహాబిలిటేషన్ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ బుధవారం తనిఖీ చేశారు. డీఈఓ సోమశేఖరశర్మ, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, డీఈలు చంద్రశేఖర్, టి.కృష్ణారెడ్డి, తహసీల్దార్ సీహెచ్.స్వామి, ఏఈ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలో నిర్మిస్తున్న ఈవీఎం గోదాం పనులను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. డీఈచంద్రశేఖర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు పాల్గొన్నారు.

పింఛన్‌దారులు మృతి చెందితే భార్యకు అవకాశం

రఘునాథపాలెం: వృద్ధాప్య పెన్షన్ పొందుతున్న వారు మరణిస్తే ఆ స్థానంలో వారి భార్యకు వితంతు లేదా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన ఆయన పింఛన్ కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. మరణాలు నమోదు కాని విషయంలో శ్రద్ధ వహించాలని చెప్పారు. జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, ఏపీడీ జయశ్రీ, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, డీపీఎం రేవతి, సర్పంచ్ మాధవితో పాటు హన్మంతరావు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాఖీ.. కళకళ



అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు సిద్ధమయ్యారు. రాఖీ పండుగను బుధ, గురువారాల్లో ఎప్పుడు జరుపుకోవాలనే సందిగ్ధత ఎదురైనా ఎక్కువ మంది గురువారం జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాఖీలు, స్వీట్ల కొనుగోలుతో షాపులు కిక్కిరిసి కనిపించాయి.

పాఠశాలల క్రీడలకు వేళాయే!

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి పాఠశాల క్రీడాపోటీల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈమేరకు జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి నర్సింహారెడ్డికి బాధ్యతలు అప్పగించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. మండల స్థాయిలో సెప్టెంబర్ 7వ తేదీ లోపు, జోనల్ స్థాయిలో 20లోగా, జిల్లాస్థాయి పోటీలు చివరి వారం వరకు నిర్వహించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంఈఓల పర్యవేక్షణలో హెచ్‌ఎంలు, పీఈటీ, పీడీలు సమావేశమై తేదీలు ఖరారు చేయాలని తెలిపారు. ఇదే సమావేశంలో జోనల్ క్రీడా కార్యదర్శిని కూడా నియమించాలని చెప్పారు. కాగా, ఇప్పటికే నలుగురితో జిల్లా స్థాయి కమిటీని నియమించగా, మరో నలుగురిని తీసుకుంటామని తెలిపారు. కానీ పోటీల తేదీలు ఖరారైనా కొత్త వారిని నియమించకపోవడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

ఎన్టీఆర్ స్మారకనాణెం కొనుగోలు చేసిన సండ్ర



స్మారక నాణెంతో ఎమ్మెల్యే

సత్తుపల్లి: ఇటీవల రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విడుదల చేసిన ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణేన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం కొనుగోలు చేశారు. తెలుగు జాతి గర్వించదగిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ.రామారావు శతజయంతిని పురస్కరించుకుని భారతప్రభుత్వం, ఆర్‌బీఐ నాణేన్ని విడుదల చేయడం అరుదైన గౌరవంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాలేరు అభివృద్ధికి రూ.125 కోట్లు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు గాను ప్రత్యేక అభివృద్ధి నిధి కింద రూ.125 కోట్లు మంజూరయ్యాయి. ఈమేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు బుధవారం జీఓను జారీ చేశారు. ఈ నిధులతో నియోజకవర్గంలో సీసీ రహదారుల నిర్మాణంతో పాటు విద్యాసంస్థల అభివృద్ధి, ఇతర మౌలిక వసతులకు కల్పనకు వినియోగించాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన ప్రతిపాదనలను కలెక్టర్ సిద్ధం చేయాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, నియోజకవర్గానికి భారీగా నిధులు కేటాయించడంపై సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తడబాటు



సత్తుపల్లిలో ప్రజాభిప్రాయం నమోదు చేయిస్తున్న మెప్మా టీఎంసీ సుజాత, సిబ్బంది

- నేటితో ముగియనున్న ప్రజాభిప్రాయ సేకరణ
- ఉమ్మడి జిల్లాలోని అన్నిచోట్లా వెనుకబాటే
- సత్తుపల్లిలో అత్యధికంగా 29.1 శాతం నమోదు

సత్తుపల్లిటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీలో కీలకమైన ప్రజాభిప్రాయ సేకరణలో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు తడబడ్డాయి. పారిశుద్ధ్య నిర్వహణపై పౌరుల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించడంపై శ్రద్ధ చూపకపోవడంతో ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కేంద్రప్రభుత్వం ఏటా ప్రకటిస్తున్న పురస్కారాల కోసం పౌరుల అభిప్రాయాలు కీలకమవుతాయి. అయితే, ఈనెల 5వ తేదీన మొదలైన ప్రజాభిప్రాయ సేకరణ గడువు గురువారంతో ముగియనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు సత్తుపల్లి, వైరా, మధిర, పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, వైరా మున్సిపాలిటీలు ఉండగా, సత్తుపల్లిలో మాత్రం మెప్మా అధికారుల కృషితో 29.1 శాతం అభిప్రాయాల సేకరణ పూర్తయింది. ఇక మిగతావన్నీ లక్ష్యసాధనలో వెనుకబడ్డాయి.

జనాభా ఆధారంగా..

మున్సిపాలిటీల్లో జనాభా ఆధారంగా ప్రజాభిప్రాయాలు సేకరించాల్సి ఉంటుంది. ప్రతీ మున్సిపాల్టీలోని జనాభాలో 60 శాతం మంది అభిప్రాయాలు నమోదు చేయాలి. ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా, తడిపొడి చెత్తలను వేర్వేరుగా ఇస్తున్నారా, డ్రెయినేజీలు శుభ్రంగా ఉన్నాయా, పబ్లిక్ టాయిలెట్లు వాడుతున్నారా, శుభ్రంగా ఉన్నాయా అనే వివరాలతో పాటు పట్టణంలో పరిశుభ్రతకు ఎంత రేటింగ్ ఇస్తారనే ప్రశ్నలకు అభిప్రాయాలు సేకరించాలి. ఇందుకోసం వార్డుల వారీగా మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను నియమించగా, ఇంటింటికీ వెళ్లి ప్రజల సెల్‌ఫోన్ ద్వారా స్వచ్ఛ సర్వేక్షన్ యాప్‌లో ఫీడ్ బ్యాక్ నమోదు చేయాలి. ఇందులో సత్తుపల్లి మున్సిపాలిటీ 29.1 శాతం నమోదు చేసి ప్రథమ స్థానంలో నిలవగా మణుగూరు మున్సిపాలిటీ కేవలం 5.9 శాతంతో చివరి స్థానంలో ఉంది.

లక్ష్యసాధనకు కృషి చేశాం



స్వచ్ఛ సర్వేక్షణ్–2023 ర్యాంక్ కోసం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేశాం. ఇందుకోసం క్షేత్ర స్థాయిలో సిబ్బంది విస్తృతంగా పర్యటించారు. గడువులోగా సాధ్యమైనంత ఎక్కువ మంది అభిప్రాయాలు నమోదు చేయించాం.

– కె.సుజాత, మున్సిపల్ కమిషనర్, సత్తుపల్లి

అక్టోబర్ 2న ర్యాంకుల పర్యటన

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ దేశవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల మధ్య స్వచ్ఛతలో పోటీ పెంచేందుకు ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ఇస్తోంది. పరిశుభ్రత, డ్రెయినేజీ చెత్త సేకరణ, తడి, పొడి చెత్త నిర్వహణ, టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, ఇంకుడు గుంతలు తదితర అంశాల ఆధారంగా ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ సంవత్సరం 9,500 మార్కులకు పోటీ జరుగుతుంది. ఇందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,525 మార్కులు, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 2,475 మార్కులు కేటాయించారు. ఈ మార్కుల ఆధారంగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా కేంద్రప్రభుత్వం మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటిస్తుంది. ఇంత కీలకమైన పోటీలో ముందు నిలవాల్సిన మున్సిపాలిటీ బాధ్యుల నిర్లక్ష్యంతో కనీస స్థాయిలోనూ ప్రజాభిప్రాయాలు నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మున్సిపాలిటీ / కార్పొరేషన్	జనాభా	ఫీడ్‌బ్యాక్ ఇచ్చిన వారు	శాతం
సత్తుపల్లి	31,857	9,258	29.1
పాల్వంచ	80,119	16,346	20.4
ఇల్లెందు	33,732	3,592	10.6
ఖమ్మం	2,84,268	27,721	9.8
కొత్తగూడెం	79,819	7,700	9.6
మధిర	31,909	2,435	7.6
వైరా	31056	1,955	6.3
మణుగూరు	32,091	1,896	5.9

వెలుగుమట్ల గుట్టల్లో బైరటీస్ తవ్వకాలు



తవ్వకాలతో ఏర్పడిన గుంతలు

ఖమ్మంఅర్బన్: కలెక్టరేట్‌కు కూతవేటు దూరాన ప్రైవేట్ ప్లాట్లలో అక్రమంగా బైరటీస్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వెలుగుమట్ల రెవెన్యూ పరిధి గుట్టపై పలువురు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇక్కడ కొందరు అక్రమంగా తవ్వకాలు సాగిస్తూ బైరటీస్ నిల్వలను రాత్రివేళ ఎగుమతి చేస్తున్నారు. గతంలో అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసినా మళ్లీ యథావిధిగా తవ్వకాలు చేస్తుండడం గమనార్హం. వారం రోజులుగా పుట్టకోట రోడ్డు వైపు ప్లాట్లలో చేపట్టిన తవ్వకాలతో భారీ గుంతలు పడుతున్నాయని యజమానులు వాపోతున్నారు. ఈ కారణంగా ప్లాట్ల యజమానులకు నష్టం జరుగుతుండగా, ప్రభుత్వం ఆదాయం కోల్పోతున్న నేపథ్యాన అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

‘డీడీఎన్’ పెంపుపై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: ధూపదీప నైవేద్య పథకం కింద ఆలయాలకు ఇచ్చే మొత్తాన్ని రూ.6వేల రూ.10 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆలయ నిర్వహణకు రూ.2 వేల నుండి రూ.4వేలకు, అర్చకుల గౌరవ వేతనాన్ని రూ.2,500 నుండి రూ.6వేలకు పెంచడంతో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేరిందని పేర్కొన్నారు.

రాఖీ శుభాకాంక్షలు

రాఖీ బంధన్(రాఖీ పౌర్ణమి) పండుగ సందర్భంగా మహిళలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం శుభాకాంక్షలు చెబుతూ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

‘అగ్నివీర్’కు అంతా సిద్ధం



అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులు

సైన్యంలో నియామకాలకు సంబంధించి అగ్నివీర్ ర్యాలీని 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన రాష్ట్రంలోని 7,397మంది అభ్యర్థులు ఇందులో పాల్గొంటారు. ప్రతిరోజు 1,200 మంది హాజరయ్యే అభ్యర్థులకు తేదీ, సమయంతో సహా అడ్మిట్ కార్డులు జారీచేశారు. ఆయా తేదీల్లో తెల్లవారుజామున 2–30గంటలకు పోటీలు ప్రారంభం కానుండగా... ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఇతర పరీక్షలు నిర్వహిస్తారు. ఈమేరకు స్టేడియాన్ని అదుపులోకి తీసుకున్న సైన్యాధికారులు పరీక్షల నిర్వహణకు గాను ఏర్పాట్లు పూర్తిచేశారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

సీఎం కేసీఆర్‌పై అసభ్యంగా పోస్ట్‌లు

కారేపల్లి: సీఎం కేసీఆర్‌పై సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్ట్‌లు పెట్టిన వ్యక్తిపై ఖమ్మం జిల్లా కారేపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కారేపల్లి మండలం గేటుకారేపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మండెపూడి సత్యనారాయణ కారేపల్లిలోని 'పొలిటికల్ పంచ్' వాట్సప్ గ్రూప్‌లో సీఎం కేసీఆర్ చిత్రాన్ని అసభ్యకరంగా ఎడిట్ చేసి పోస్ట్ చేశాడు. ఈవిషయమై కారేపల్లికి చెందిన భూక్యా చందూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామారావు తెలిపారు. కాగా, ఈ గ్రూప్‌లో తరచుగా వివాదస్పద అంశాలు పోస్ట్ చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యాన గ్రూప్ అడ్మిన్‌పై కూడా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్ఓ

ఖమ్మం స్పోర్ట్స్: నిజామాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఉషూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రెండు పతకాలు సాధించారు. బాక్సింగ్‌లో ఎం.డీ మస్కాన్ పర్వీన్ రజతం, ఎస్.కే.సనాకౌసర్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. వీరిని డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఉషూ కోచ్ పి.పరిపూర్ణచారి బుధవారం అభినందించారు.

సైనికులకు రాఖీలు పంపిన విద్యార్థినులు



రాఖీలతో విద్యార్థినులు, అధ్యాపకులు

ఖమ్మంరూరల్: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు ఖమ్మం రూరల్ మండలం పెదతండాలోని గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు రాఖీలు పంపించారు. విద్యార్థినులు స్వయంగా తయా రు చేసిన 1,560 రాఖీలను సైనికులకు పంపించాల్సిందిగా హైదరాబాద్‌కు చెందిన సంస్కృతి ఫౌండేషన్ బాధ్యులకు అందజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ బి.గోపాల్, సంస్కృతి ఫౌండేషన్ ఇన్‌చార్జ్ రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

పోలీసులతో దౌర్జన్యంగా ప్రవర్తించారు..

నగర ఏసీపీ హరికృష్ణ

ఖమ్మంక్రైం: విధినిర్వహణలో ఉన్న పోలీ సులతో కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా ప్రవర్తించి గాయపర్చారని నగర ఏసీపీ హరికృష్ణ వెల్లడించారు. ఖమ్మంలోని కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడార. కేఎంసీ ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా చేస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను నష్టం జరిగే అవకాశమున్నందున బందోబస్తు కల్పించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మల్లీశ్వరి ఫిర్యాదుతో తమ సిబ్బంది బందోబస్తు నిర్వహించారని తెలిపారు. ఈక్రమంలో ధర్నా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుంటుండగా కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, ఆమె భర్త నరేందర్ తదితరులు సీఐ స్వామితో పాటు ఒక మహిళా ఏఎస్ఐ, కానిస్టేబల్, హోంగార్డును గాయపర్చారని పేర్కొన్నారు. దీంతో 29మంది కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయగా, మహిళా నేతలను మహిళా పోలీసులు మాత్రమే అదుపులోకి తీసుకున్నారని స్పష్టం చేశారు. ఈసమావేశంలో టూటౌన్ సీఐ కుమారస్వామి పాల్గొన్నారు.

మాతృత్వానికి మరో రూపం



మాతృత్వంతోనే జీవితానికి పరిపూర్ణత లభించినట్లు ప్రతీ స్త్రీ భావిస్తుంది. అయితే, వివిధ కారణాలతో కొందరికి సంతాన యోగం ఉండదు. ఇక మరి కొందరు పుట్టిన పిల్లలను వద్దనుకుని వదిలేస్తుంటారు. ఇంకొందరు అక్రమ పద్ధతుల్లో దత్తత ఇస్తుంటారు. అలాకాకుండా అనాథలు, పిల్లలు వద్దనుకునే వారి నుంచి చేరదీసిన చిన్నారులను చట్టపరమైన ప్రక్రియ ద్వారా దత్తత ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ విధానంలో సంతానం లేని వారికి ఆ లోటు తీరుతుండగా.. అనాథలుగా మిగిలిపోయే పిల్లలకు బంగారు భవిష్యత్ సిద్ధిస్తోంది. – సాక్షి, ఖమ్మం డెస్క్

సంతానం లేని వారికి వరంలా దత్తత

- అటు అనాథలకు మంచి భవిష్యత్
- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా చట్టపరమైన ప్రక్రియ
- దేశ, విదేశాల నుంచి వెల్లువెత్తుతున్న దరఖాస్తులు

అనాథ బాలలను పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చేందుకు ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా కృషి చేస్తోంది. అవాంఛనీయ గర్భం దాల్చి పిల్లలు వద్దనుకున్న వారు, పిల్లలను పెంచే స్తోమత లేనివారే కాక తల్లిదండ్రులు వదిలేసిన పిల్లలను శిశుగృహ బాలల రక్షిత గృహాల్లో చేరదీసి బాగోగులు చూస్తారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పరిధి న్యూఢిల్లీలోని ప్రత్యేక దత్తత వనరుల సంస్థ (కారా) ద్వారా చట్ట ప్రకారం సంతానం లేని వారికి దత్తత ఇస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి పదేళ్ల లోపు అనాథ పిల్లలకు చట్టప్రకారం ప్రేమను పంచే కుటుంబాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం.

ఎవరు దరఖాస్తు చేసుకోవచ్చు?

భౌతికంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడమే కాక ఆర్థికంగా బాగుండి.. దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులు లేని వారిని దత్తత కోసం అర్హులుగా గుర్తిస్తారు. అయితే, అప్పటికే పెళ్లి అయి పిల్లలు ఉన్నా, లేకున్నా దత్తత కోసం ముందుకు రావొచ్చు. ఇక భర్త లేని మహిళలు ఆడ లేదా మగ శిశువును, భార్య లేని పురుషులు ఆడబిడ్డను దత్తత తీసుకునే అవకాశముంది. కాగా, వివాహం జరిగి రెండేళ్ల వైవాహిక జీవితం పూర్తయిన దంపతులను మాత్రమే అర్హులుగా పరిగణిస్తారు. ఒకవేళ దంపతులకు ముగ్గురు అంతకన్నా ఎక్కువ పిల్లలు ఉంటే వారు మాత్రం అనర్హులుగా భావిస్తారు. ఇలా పలు నిబంధనలతో పాటు వయస్సు ఆధారంగా దత్తత ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరిస్తుంది.

దత్తతకు దరఖాస్తు ఇలా

దత్తత కోరు తల్లిదండ్రులు మొదటగా www.cara.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆతర్వాత రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారు. ఈ నంబర్ ఆధారంగా ఎప్పటికప్పుడు దరఖాస్తు ప్రగతిని తెలుసుకోవచ్చు. ఒకసారి చేసిన దరఖాస్తు మూడేళ్లపాటు మనుగడలో ఉంటుంది. ఎవరి దరఖాస్తు అయినా తిరస్కరిస్తే అప్పీల్‌కు కూడా అవకాశమిస్తారు. అంతేకాక దత్తత కోసం ఆడ లేదా మగ శిశువు కావాలో సైతం ఎంచుకోవచ్చు. క్రమ సంఖ్య ఆధారంగా దత్తతకు సిద్ధంగా ఉన్న శిశువు ఫొటో, ఇతర నివేదికలు అందజేస్తారు. ఇందులో అంతా బాగుందని భావిస్తే 48 గంటల్లోపు నిర్ణయం చెప్పాలి. లేకపోతే మరో 90 రోజులు ఆగాల్సి ఉంటుంది. ఇలా మూడు సార్లు శిశువుల వివరాలు అందిస్తారు. ఇందులో బిడ్డను ఎంచుకుంటే సంస్థ బాధ్యులు దంపతులను పిలిచి అన్ని వివరాలు ఆరా తీస్తారు. ఈ సమయంలో కూడా బిడ్డ వద్దనుకుంటే చెప్పే అవకాశముంటుంది. అయితే, ఈ దశలో శిశువును నిరాకరిస్తే మాత్రం వారి నంబర్ సీనియారిటీ జాబితాలో చివరకు చేరుతుంది.



ఇటీవల విదేశీ జంటకు బాలికను అప్పగించి శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్ గౌతమ్

అప్పగింత.. పర్యవేక్షణ

బిడ్డను ఎంచుకున్నాక ఆరోగ్య పరిస్థితిపై అనుమానాలు ఉంటే వైద్య పరీక్షలు చేయించేందుకు అనుమతిస్తారు. ఆతర్వాత తల్లిదండ్రుల నుంచి అఫిడవిట్ తీసుకుని శిశువును అప్పగిస్తారు. ఈ విషయంలో ఉత్తర్వుల కోసం సమీపంలోని ఫ్యామిలీ కోర్టులో పిటీషన్ దాఖలు చేస్తారు. ఆరోజు నుంచి రెండు నెలల్లోగా విచారణ పూర్తిచేసి తల్లిదండ్రులకు ఉత్తర్వులు అందిస్తారు. అయితే, బిడ్డను దత్తత ఇచ్చి వదిలేయకుండా ఆరు నెలలకోసారి రెండేళ్ల పాటు ప్రత్యేక దత్తత సంస్థ పర్యవేక్షిస్తుంది. ఆ సమయంలో బిడ్డకు కౌన్సెలింగ్ అవసరమైతే కూడా ఇస్తారు. కాగా, దత్తత తీసుకునే సమయంలో రూ.64వేల వివిధ ఫీజుల నిమిత్తం డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

214 దరఖాస్తులు... 63 మంది దత్తత

తెలంగాణ ఏర్పడ్డాక 2014 నుంచి ఇప్పటివరకు జిల్లాలో దత్తత కోసం 214 దరఖాస్తులు అందాయి. ఇందులో అబ్బాయిల కోసం 133 దరఖాస్తులు అందగా, అమ్మాయిల కోసం 67 మంది, ఎవరైనా పర్వాలేదని 14 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 63మందికి శిశువులను ఇప్పటివరకు దత్తత ఇచ్చారు. ఇందులో దేశం పరిధిలో 35మంది అమ్మాయిలు, 14మంది అబ్బాయిలను దత్తత ఇవ్వగా... విదేశాలకు చెందిన దంపతులు ఎనిమిది మంది అమ్మాయిలు, ఆరుగురు అబ్బాయిలను దత్తత తీసుకున్నారు. తాజాగా విదేశాలకు చెందిన ఓ జంట గ్రహణమొర్రితో బాధపడుతున్న అమ్మాయిని దత్తత తీసుకుని భేష్ అనిపించుకున్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో భారీగానే దరఖాస్తులు ఉండగా, ఖమ్మం శిశు గృహలో దత్తతకు అర్హులైన బాలలు ఐదుగురే ఉన్నారు. భద్రాద్రి జిల్లాలోనూ మూడేళ్ల క్రితం శిశుగృహను ఏర్పాటు చేయగా... ఖమ్మం జిల్లాకు వచ్చిన 214దరఖాస్తుల్లో 73 దరఖాస్తులను అక్కడకు బదలాయించారు.

పిల్లలు లేని వారికి వరం



పిల్లలు లేని దంపతులు అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకుంటే శిశు గృహలో ఉన్న బాలలను దత్తత తీసుకునే అవకాశముంది. ఇప్పటికే ఖమ్మం శిశుగృహ నుంచి వివిధ దేశాల వారికి కూడా దత్తత ఇచ్చాం. ఈ అంశంపై అవగాహన లేని వారు మమ్ముల్ని నేరుగా సంప్రదించవచ్చు. అలాకాకుండా అక్రమంగా దత్తత తీసుకుంటే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయి.

– భారతరాణి, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్

చట్టప్రకారమే దత్తత



ప్రభుత్వం నుంచి తీసుకునే దత్తతే చట్టబద్ధమైనది. శిశుగృహ సంరక్షణలో ఉండే చిన్నారులను నిబంధనల మేరకు దత్తత ఇస్తున్నాం. ఇందుకోసం అర్హతల ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్నపిల్లలు వద్దనుకునేవారు సైతం ఇతర మార్గాల్లో వదిలేయకుండా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఊయలలో కానీ.. సంబంధిత అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అప్పగించవచ్చు.

– తాళ్లూరి సుమ, జిల్లా సంక్షేమాధికారి

అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తాం

సెకండ్ ఏఎన్ఎంల సమ్మెలో పొంగులేటి



మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రాఖీ కడుతున్న రెండో ఏఎన్ఎంలు

ఖమ్మంమయూరిసెంటర్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని... ఆ వెంటనే ఎలాంటి షరతులు లేకుండా సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేస్తామని... ఇది పార్టీ పక్షాన ఇస్తున్న హామీ అని కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గత పదిహేను రోజులుగా సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలకు ఆయన బుధవారం ఖమ్మం కలెక్టరేట్ వద్ద సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరితే ప్రభుత్వం నిరాకరించడం సరికాదన్నారు. అనంతరం ఏఎన్ఎంలు పొంగులేటికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, మువ్వా విజయబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం నుంచి కాంగ్రెస్ నాయకుడు గుజ్జునూరి వినోద్ ఆధ్వర్యాన పలువురు యువకులు చేపట్టిన పాదయాత్ర బుధవారం ఖమ్మం చేరుకోగా క్యాంపు కార్యాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. పాదయాత్రగా వచ్చిన వారిలో వినోద్‌తో పాటు దండు అజయ్, నకిరకంటి బాబు, ఇసంపల్లి సంపత్, ఇసంపల్లి గణేష్, తమ్మడపల్లి రాకేష్, దేవులపల్లి ప్రవీణ్, నాగెల్లి సుధీర్ తదితరులు ఉన్నారు.

కల్లూరులో రోడ్డుషో



కల్లూరు రోడ్డు షోలో శ్రీనివాసరెడ్డి, నాయకులు

కల్లూరు/కల్లూరు రూరల్: కల్లూరులో బుధవారం కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన రోడ్డు షో నిర్వహించారు. మండలంలోని హనుమాతండా నుంచి చిన్నకోరుకొండి వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించగా, కల్లూరులో శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కొండూరు సుధాకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక కల్లూరు మండలం చిన్నకోరుకొండిలో ఏర్పాటుచేసిన సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈసమావేశాల్లో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, నాయకులు యాసా వెంకటేశ్వరరావు, కాటేపల్లి కిరణ్‌కుమార్, మట్టూరి జనార్ధన్, నోటి కృష్ణారెడ్డి, పెద్దబోయిన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ పార్టీ డబ్బుతో అమలుచేయడం లేదని... ప్రజాధనమే అయినందున పార్టీ కార్యకర్తలకు కాకుండా అర్హులందరికీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మైనార్టీలు 8వేల మంది ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకుంటే వంద మందికే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అలాగే, బీసీ బంధు సాయం 26 వేల మందికే ఇచ్చారని, దళితబంధు పథకాన్ని ఎమ్మెల్యేలు చెప్పిన వారికే అమలు చేస్తున్నారని విమర్శించారు. అలా కాకుండా లబ్ధిదారుల ఎంపిక లాటరీ ద్వారా నిర్వహించాలని, గృహలక్ష్మి సాయాన్ని పెంచి ప్రతీ నియోజకవర్గంలో 5వేల మందికి వర్తింపచేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇక కేంద్ర పాలనలో అనేక రంగాలను ప్రైవేటీకరించిన నేపథ్యాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు పార్టీ ఆధ్వర్యాన నిరసనలు తెలపనున్నామని నాగేశ్వరరావుతెలిపారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, మీరా, జబ్బార్, వై.విక్రమ్, శ్రీనివాసరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్.. యువకుడు మృతి



నవీన్ (ఫైల్)

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం వద్ద హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన కారంశెట్టి నవీన్ (25) సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు బైక్‌పై ఆయన ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో కేతేపల్లి మండలం చీకటిగూడెం వద్ద పెట్రోల్ బంక్ సమీపానికి చేరుకోగానే రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో నవీన్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ఖమ్మంక్రైం: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటనపై ఖమ్మం టూ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం అంజనాపురానికి చెందిన గుగులోతు వంశీ(23) ఖమ్మంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. ఆయన విజయవాడ ఆటోనగర్‌కు చెందిన యువతిని ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే, పురుడు కోసం పుట్టింటికి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో ఈనెల 24న వంశీ భార్య వద్దకు వెళ్లాడు. అక్కడ అత్త, భార్యతో గొడవ జరగడం, భార్య తాను రానని చెప్పటంతో తిరిగి వచ్చేశాడు. ఈనెల 26వ తేదీన బంక్‌లో గడ్డి మందు తాగిన ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై వంశీ తండ్రి కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కుమారస్వామి తెలిపారు.

పది కేజీల ఎండుగంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయితో ఎక్సైజ్ అధికారులు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద బుధవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం బుధవారం చేపట్టిన తనిఖీల్లో పది కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యాన ఖమ్మం వన్‌టౌన్ సిబ్బందితో కలిసి శ్రీశ్రీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కొత్త బస్టాండ్ ఏరియాల్లో తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా కొత్త బస్టాండ్ ఆటోస్టాండ్ దగ్గర ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా 10 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. వీరిని విచారించగా ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన నరన్ రే, ఏపీలోని మోతుగూడెంకు చెందిన కొర్ర పూర్ణ, కిల్లో కమలాసన్‌గా తేలింది. గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎస్‌ఐలు అనిల్, రబ్బాని, సిబ్బంది సుధీర్, వెంకటేష్, హరీష్, విజయ్, హన్మంతరావు, స్వరూప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి

ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టడంతో ఘటన



రాకేష్ (ఫైల్)




భాస్కర్ (ఫైల్)

ఏన్కూరు: వరుసకు అన్నదమ్ములయ్యే యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. ఏన్కూరు వద్ద బుధవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కూరాకుల రాకేష్(22), కూరాకుల భాస్కర్(20) ద్విచక్రవాహనంపై తమ ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో కొత్తగూడెం నుండి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు హెచ్‌పీ బంక్ వద్ద ఎదురుగా వచ్చిన వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాకేష్ అక్కడికక్కడే మృతి చెందగా, భాస్కర్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తుండగా కన్నుమూశాడు. వీరిద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు కాగా, కుటుంబీకులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. ఇందులో రాకేష్ తండ్రి నర్సింహరావు ఇటీవలే మృతి చెందగా ఐదు రోజుల క్రితమే కర్మకాండలు పూర్తయ్యాయి. ఆయనకు చెల్లె ప్రత్యూష, తల్లి లక్ష్మి ఉన్నారు. అలాగే, భాస్కర్‌కు తండ్రి శ్రీనివాసరావు, తల్లి రూప, తమ్ముడు చరణ్ ఉన్నారు. ఎస్‌ఐ బాదావత్ రవి ఘటనాస్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

ఆస్పత్రికి వెళ్తుండగా ఘటన



కల్పన (ఫైల్)

సత్తుపల్లిరూరల్: కడుపునొప్పితో బాధపడుతున్న భార్యను కారులో ఆస్పత్రికి తీసుకెళ్తున్న భర్త ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో ఆమె మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన దండు కల్పన(25)కు కడుపునొప్పి వస్తుండడంతో సత్తుపల్లిలోని ఆస్పత్రికి భర్త దండు ఫిలిప్(బాబు) మంగళవారం అర్ధరాత్రి తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో ఓసీ సమీపాన రోడ్డు పక్కన నిలిపిన బొగ్గు లారీని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై కల్పన అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్తతో పాటు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

బోనకల్: బోనకల్–వత్సవాయి ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వైరా మండలం లింగన్నపాలెం గ్రామానికి చెందిన చలగాని రామకృష్ణ తన భార్యను తీసుకుని బైక్‌పై అత్తగారి ఊరైన పెనుగంచిప్రోలు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టగా రామకృష్ణ ,చేయి విరగడంతో పాటు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ముదిగొండ: పాతకక్షల కారణంగా తనపై దాడి చేసి హతమార్చేందుకు యత్నించారని ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుతో ముదిగొండ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని సువర్ణాపురానికి చెందిన తోట ధర్మారావు ఇంటి నుంచి కారులో ముదిగొండ వెళ్తున్నాడు. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కొండూరి రామాంజనేయులు, కుటుంబీకులు ఇనపరాడ్లతో కారు అద్దాలు ధ్వంసం చేయడమే కాక ధర్మారావుపై దాడి చేశారు. ఈఘటనపై ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో రామాంజనేయులు, ఆయన కుటుంబీకులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపారు.

క్లుప్తంగా...


బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న భూమన, ఈవో ధర్మారెడ్డి తదితరులు

18 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం తిరుమల ఆలయం ఎదుట ఆవిష్కరించారు. అనంతరం భూమన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. సెప్టెంబర్ 18న ధ్వజారోహణం సందర్భంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు సంతృప్తికరంగా వాహన సేవలతో పాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు స్వీకరించబోమన్నారు. సెప్టెంబరు 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం నిర్వహిస్తామని తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా బుధవారం ఆరుగురు శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా, వై.సీతారామిరెడ్డి, బాలసుబ్రమణియన్ పళనిస్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం యానాదయ్య, సిద్ధా వీరవెంకట సుధీర్ కుమార్ బోర్డు సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరితో శ్రీవారి ఆలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు.

4 నుంచి వ్యవసాయంపై జీ-20 వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: 'వాతావరణ పరిస్థితులను తట్టుకునే వ్యవసాయం'పై సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జీ-20 టెక్నికల్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఐకార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వర్క్‌షాప్‌ను శంషాబాద్ సమీపంలోని నోవాటెల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

పొత్తులు లేకుండా పోరాడే ధైర్యముందా?

చంద్రబాబుకు సజ్జల సవాల్

- ప్రధాని మోదీని తిట్టిన నోటితోనే పొగడ్తలా?
- కాళ్లు పట్టుకోగలిగే నేర్పు చంద్రబాబుకే సొంతం
- ప్రభుత్వ వ్యతిరేక ఓటే లేదు.. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు పొత్తులు లేకుండా పోటీ చేయాలనే ఆలోచన చేసే ధైర్యం కూడా లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం నడ్డాతో వంగివంగి నంగినంగిగా మాట్లాడారని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు దూషించిన నోటితోనే ఇప్పుడు పొగుడుతున్నారని గుర్తు చేశారు. ఎవరినైనా సరే తిట్టిన గంటలోనే కాళ్లు పట్టుకోగలిగే నేర్పు ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సజ్జల బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్యాకేజీ చాలని.. సన్మానాలు నిర్వహించి

టీడీపీపై పూర్తిగా నమ్మకం కోల్పోయిన కార్యకర్తలను కాపాడుకోవడానికే చంద్రబాబు పొత్తుల కోసం పాకులాడుతున్నారు. పవన్ కల్యాణ్‌తో కలసి పోటీ చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో పొత్తుల కోసం తహతహలాడుతున్నారు. కమీషన్ల దాహంతో పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడం కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు 2016లో కేంద్రానికి తాకట్టు పెట్టారు. హోదా కంటే ప్యాకేజీతోనే అధికంగా ప్రయోజనం చేకూరుతుందని చంద్రబాబు సంబరాలు చేసుకున్నారు. నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కూడా సన్మానించారు. ప్రత్యేక హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకొచ్చామని, అంతకు మించి బీజేపీతో విభేదాలు లేవంటూ ఇప్పుడు పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారు.

బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ..

ఏపీలో 175 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే లేని టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటూ చంద్రబాబు జోకులు వేస్తున్నారు. ఆయన వ్యవహార శైలి బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ. జనసేన, బీజేపీతో పొత్తు ఉండదని బాబు ప్రకటిస్తే లోకేశ్ పాదయాత్రకు వస్తున్న అరకొర కార్యకర్తలు కూడా మొహం చాటేయడం ఖాయం.

వ్యతిరేక ఓటు ఉంటే కదా ఏకం చేయడానికి?

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ గత 50 నెలలుగా అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, తిరుపతి లోక్‌సభ.. బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు స్థాయి విజయాలు సాధించడమే అందుకు నిదర్శనం. వైఎస్సార్‌సీపీకి 70 శాతం మంది ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యతిరేకంగా ఉన్నాయని ప్రతిపక్షాలు భావిస్తున్న 30 శాతం ఓట్లు ఏకమైనా ఒరిగేదేముంది? 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయభేరి మోగించడం ఖాయం. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు.

ఎన్టీఆర్ ఆత్మకూ వెన్నుపోటు..

ఎన్టీఆర్ అగ్నిసాక్షిగా లక్ష్మీ పార్వతిని వివాహం చేసుకున్నారని, 1994 ఎన్నికల్లో వారిద్దరూ కలిసి ప్రచారం చేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని, తద్వారా వారి వివాహాన్ని ప్రజలు హర్షించారని సజ్జల గుర్తు చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని, టీడీపీని హస్తగతం చేసుకున్న చంద్రబాబుకు ఇప్పటికీ సొంత గుర్తింపు లేదన్నారు. అవసరమైనప్పుడల్లా ఎన్టీఆర్ బొమ్మను వాడుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమానికి ఆయన భార్య లక్ష్మీపార్వతిని ఆహ్వానించకుండా ఎన్టీఆర్ ఆత్మకు మరోసారి వెన్నుపోటు పొడిచి క్షోభ పెట్టారని మండిపడ్డారు. బీజేపీలోకి చంద్రబాబు పంపిన ఏజెంట్లతోపాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌లా పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

రాష్ట్ర రక్షణకు మేధావులు బీజేపీలోకి రావాలి..

▶ మొదటి పేజీ తరువాయి

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రోజువారీ ఖర్చుల కోసం కూడా.. భూముల వేలం ద్వారా డబ్బు సమకూర్చుకుంటోన్న దుస్థితి నెలకొందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక అవసరాల కోసం ఓఆర్ఆర్ రింగ్ రోడ్డును తాకట్టు పెట్టడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం తెలంగాణలోని విద్యావంతులు, మేధావులు బీజేపీలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని ఆయన పిలుపునిచ్చారు.

ఏ బాధ్యతనిచ్చినా స్వీకరిస్తాం

బీజేపీ అగ్రనేతలు వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్‌జోషి వంటి పెద్దల ప్రభావం తనపై ఉందని పార్టీలో చేరిన డాక్టర్ వికాస్ తెలిపారు. తాను, తన భార్య డా.దీప ప్రజలకు మరింత సేవ చేసేందుకు బీజేపీలో చేరామని, రాబోయే రోజుల్లో అప్పగించే బాధ్యతలను మనస్ఫూర్తిగా నిర్వర్తిస్తామన్నారు.

– డాక్టర్ వికాస్

ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ గెలుపు తథ్యం

తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుపు తథ్యమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనపట్ల ప్రజలు పూర్తిగా విసిగిపోయారనీ, రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనమన్నారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో రామరాజ్యం రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. డా.వికాస్, దీపల చేరికతో రాజన్న సిరిసిల్లలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు.

– బండి సంజయ్

విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి

దేశంలో మోదీ ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితులై, ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో డాక్టర్ వికాస్, దీప దంపతులు బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని విద్యావంతులు ముఖ్యంగా యువత రాజకీయ రంగంలోకి రావాలని విలువలతో కూడిన రాజకీయాలు, జవాబుదారీతనంతో కూడిన రాజకీయాలు వారితోనే సాధ్యమన్నారు.

– డా. కె. లక్ష్మణ్

ఉత్తర తెలంగాణలో బీజేపీ బలోపేతం

వేములవాడ ప్రాంతంలో సామాజిక, సేవా కార్యక్రమాలను చేపడుతున్న డాక్టర్ దీప, వికాస్ దంపతుల చేరికతో ఉత్తర తెలంగాణ ప్రాంతంలో బీజేపీ మరింత బలోపేతమవుతుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు.

– ఎంపీ అర్వింద్

సోలాపూర్‌లో మార్కండేయ రథయాత్ర

మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ హాజరు


సోలాపూర్‌లో స్థానిక నేతలతో హరీశ్, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని సోలాపూర్‌లో అత్యంత వైభవంగా జరిగిన మార్కండేయ రథోత్సవంలో రాష్ట్ర మంత్రులు టి.హరీశ్‌రావు, మహమూద్ అలీ పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఇద్దరు మంత్రులతో పాటు మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బుధవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో సోలాపూర్‌కు వెళ్లారు. స్థానిక పద్మశాలీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన మార్కండేయ రథోత్సవంలో బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులతో కలిసి మంత్రులు పాల్గొన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతి రాఖీ పౌర్ణమి సందర్భంగా రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీ. కాగా ఈ రథోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రులకు స్థానిక మహిళలు, బీఆర్ఎస్ నేతలు స్వాగతం పలికి రాఖీలు కట్టారు. మార్కండేయ ఆలయ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆలయ నిర్వాహకులకు మంత్రి హరీశ్‌రావు రూ.కోటి విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

సోలాపూర్ బహిరంగ సభాస్థలి పరిశీలన

సోలాపూర్‌లో త్వరలో జరిగే బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొంటారు. సభ నిర్వహణ కోసం అనువైన స్థలాన్ని మంత్రి హరీశ్‌రావు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. బాల్‌కోటి మైదానం, ఈద్గా మైదానాలను పరిశీలించిన నేతలు కేసీఆర్‌తో చర్చించిన తర్వాత వేదికను ఖరారు చేస్తామని వెల్లడించారు.

చవితి తర్వాతే బీజేపీ బస్సుయాత్రలు

సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి తర్వాతే బస్సు యాత్రలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పండుగ ముగియగానే భద్రాచలం శ్రీరాములవారి ఆలయం, బాసరలోని శ్రీసరస్వతీ దేవాలయం, ఆలంపూర్ శ్రీజోగుళాంబ గుడి నుంచి రథయాత్రలు(బస్సుయాత్ర)ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మూడు ప్రాంతాల నుంచి 18 రోజులపాటు 60-70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ యాత్రలు నిర్వహించాలని భావిస్తున్నారు. సెప్టెంబర్ 7 తర్వాత రథయాత్రలు మొదలుపెట్టి 17న హైదరాబాద్ స్టేట్ విమోచన వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రధాని మోదీ పాల్గొనేలా భారీ బహిరంగసభ నిర్వహించాలని తొలుత భావించారు. అయితే వినాయక చవితి, ఇతర కారణాల వల్ల సెప్టెంబర్ 20 తర్వాత ఈ యాత్రలు చేపడితే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. బస్సు యాత్రల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో బహిరంగసభ ద్వారా ఏర్పాటు చేసే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ


మంత్రి పట్నం మహేందర్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కమిషనర్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జాయింట్ డైరెక్టర్ జగన్, ఈఈ వెంకటేష్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సమాచార, ప్రజా సంబంధాలు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తనకు కేటాయించిన చాంబర్‌లో మహేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సచివాలయంలోని మొదటి అంతస్తులో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సమాచార శాఖ కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, కృష్ణారావు, బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


జిల్లా వార్తలు

రామయ్య సేవకు ట్రాక్టర్ వితరణ


ఈఓ రమాదేవికి ట్రాక్టర్ తాళం అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఓ భక్తుడు ట్రాక్టర్ వితరణగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన బన్నారిదాస్ రోషన్‌లాల్ రూ.7.75 లక్షల విలువైన మహీంద్ర ట్రాక్టర్‌ను రామయ్య సేవలో వినియోగించుకునేందుకు గాను అందించాడు. ఈ మేరకు మహీంద్ర కంపెనీ ప్రతినిధులు ట్రాక్టర్‌ను బుధవారం ఆలయ ఈఓ రమాదేవికి అప్పగించారు.

నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న ఈఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి బుధవారం భక్తులు విరాళం అందజేశారు. ఖమ్మంకు చెందిన ఎన్.వసంతకుమారి రూ.1,01,111 చెక్కును ఈఓ రమాదేవికి అందజేశాక కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు.

కేవీకే కోఆర్డినేటర్ బదిలీ

వైరా: వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా ఏడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ జె.హేమంత్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను పదోన్నతిపై అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. అలాగే, వైరా కేవీకే కోఆర్డినేటర్‌గా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ శాఖ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎ.శైలజను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోరుబాటలో ఉపాధ్యాయులు

- ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నిర్ణయం
- రేపు హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో ధర్నా
- 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించాలంటూ పిలుపు



ఖమ్మంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఖమ్మం సహకారనగర్: విద్యారంగంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ)గా ఏర్పడ్డారు. ఈమేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టగా... గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహణకు నిర్ణయించారు. పలు ప్రధాన సమస్యలను అజెండాగా తీసుకుని ధర్నా నిర్వహిస్తుండగా, జిల్లా నుంచి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సమయానికి జీతాలు రావడం లేదని...

మొదటి పీఆర్‌సీ గడువు ముగిసినా పూర్తి స్థాయిలో అమలు జరగకపోగా, రెండో వేతన సవరణ సంఘం నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గత పీఆర్‌సీలో 22 నెలల ఆర్థిక ప్రయోజనం నష్టపోగా ఈ దఫా అలాంటి నష్టం జరగకుండా ఉండాలంటే గత నెల(జూలై 1)నుంచే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక గతంలో ప్రతినెల 1వ తేదీన వేతనాలు రాగా.. ఇప్పుడు అలా జరగకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. అంతేకాక సప్లిమెంటరీ బిల్లులు, సెలవుల జీతాలు, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ క్లెయిమ్‌లు, పెన్షనర్ల బెనిఫిట్స్, పీఆర్‌సీ బకాయిలు ట్రెజరీలో పేరుకుపోయాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే, హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం పరిమితి లేకుండా అందిస్తామని చెప్పినా అమలుకు నోచుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ఖాళీల భర్తీ మాటేమిటి?

వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో బదిలీలు, పదోన్నతులు, నియామకాల ద్వారా చేపట్టాలని కోరుతున్నారు. అయినప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదని ఆవేదన చెందుతున్నారు. 2019లో హడావుడిగా అప్‌గ్రేడ్ చేసిన పండిట్, పీఈటీ పోస్టులపై నెలకొన్న వివాదాన్ని త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నా పరిష్కారం కాలేదని లేదని వాపోతున్నారు.

సీపీఎస్ రద్దు కూడా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని యూఎస్‌పీసీ బాధ్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కొన్నాళ్లుగా ఉద్యమిస్తున్నారు. అలాగే, విద్యాశాఖలో పదోన్నతులు కల్పించాలని, జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో పదోన్నతుల కోటా పునరుద్ధరించాలని, జీఓ 317 అమలు చేసిన తర్వాత బ్లాక్ చేసిన 13జిల్లాల స్పౌజ్ బదిలీలు నిర్వహించాలని, నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని డిమాండ్‌తో ఆందోళన బాట పట్టారు. ఈమేరకు జూలై 18, 19వ తేదీల్లో మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించగా... ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. ఇప్పుడు చివరగా గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు సిద్ధమయ్యారు. ఈ విషయమై కొన్నాళ్లుగా విస్తృతంగా ప్రచారం చేసిన సంఘాల నాయకులు... జిల్లా నుంచి భారీగా ఉపాధ్యాయులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మొండివైఖరి విడనాడాలి



తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో విద్యాశాఖ వివక్షత ఎదుర్కొంటుంది. విద్యాశాఖ, విద్యారంగ సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్షించలేదు. అన్ని శాఖల్లో పదోన్నతులు ఇచ్చినా విద్యాశాఖపై ఇవ్వలేదు. ఇకనైనా మొండివైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం.

– దేవరకొండ సైదులు, యూఎస్‌పీఎస్‌సీ స్టీరింగ్ కమిటీ బాధ్యుడు

సమస్యల పరిష్కరించాలనేదే డిమాండ్



ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడుతున్నాం. ఇదే రోజు పెన్షన్ విద్రోహదినంగా పాటిస్తాం. ఈ ధర్నాకు ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలివచ్చేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు.

– పి.నాగిరెడ్డి, యూఎస్‌పీఎస్‌సీ స్టీరింగ్ కమిటీ రాష్ట్ర బాధ్యుడు

సత్తుపల్లి జిల్లా ఏర్పాటు చేయండి..


సత్తుపల్లి కోర్టు ఎదుట నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల ప్రజల సౌలభ్యం కోసం సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని.. ఈ విషయంలో ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు కృషి చేయాలని సత్తుపల్లి బార్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. బుధవారం సత్తుపల్లి అదనపు జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో న్యాయవాదులు తీర్మానం చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ.. వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు సత్తుపల్లి జిల్లా ఏర్పాటు కోసం కృషి చేయాలని విన్నవించారు. లేనిపక్షంలో మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించేందుకు వెనుకాడేది లేదని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపాటి శ్రీనివాసరావు, న్యాయవాదులు కొండపల్లి విజయ్‌కుమార్, షేక్ బుజ్జీ సాహెబ్, పిన్నమనేని జానకీరామారావు, ఎం.రాజేంద్రప్రసాద్, శేషారావు, ఆర్.సీతారామయ్య, కూకలకుంట రవి, వెంకట్రావు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, కిరణ్‌రంజని, శిరీష, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్


వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్రం అధ్యాపకుడు బి.వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పాల్ పర్యవేక్షణలో 'ది డెవలప్‌మెంట్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ సర్టైన్ క్రిస్టల్స్'అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను హరియాణాలోని నీలం యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, అధ్యాపకులు బుధవారం సన్మానించారు.

ప్రైవేట్, విదేశీ సంస్థలకు దీటుగా బొగ్గు ఉత్పత్తి

సింగరేణి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ దేవేందర్


ఓసీలో బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: ప్రస్తుతం బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఉన్న నేపథ్యాన ప్రైవేట్, విదేశీ సంస్థలకు దీటుగా సింగరేణిలో ఉత్పత్తి జరుగుతోందని సింగరేణి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ జి.దేవేందర్ తెలిపారు. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, రవాణాను పెంచేందుకు డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ఆయన సత్తుపల్లి జేవీఆర్ ఓసీని సందర్శించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. వినియోగదారులు సింగరేణి సరఫరా చేసే బొగ్గు నాణ్యతపై నమ్మకంగా ఉన్నారని తెలిపారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి చేస్తూ రవాణా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి, క్వాలిటీ మేనేజర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.

పీవీకే-5 షాఫ్ట్ గనిని తనిఖీ చేసిన డైరెక్టర్


ఉత్పత్తి వివరాలపై చర్చిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5 షాఫ్ట్ గనిని డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణాతో పాటు కార్మికుల గైర్హాజరుపై అధికారులతో చర్చించారు. మ్యాన్‌రైడింగ్ సిస్టమ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ.. కార్మికుల గైర్హాజరు శాతం తగ్గించి బొగ్గు ఉత్పత్తి పెరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. ఏరియా జీఎం శాలేంరాజు, అధికారులు పాలడుగు శ్రీనివాస్, సీహెచ్.శ్రీనివాస్, షాకీర్, అజయ్, జీపీ రావు, ఎం.ప్రదీప్ పాల్గొన్నారు.

తలసేమియా రహిత సమాజం కోసం కృషి

ఏఆర్ ఏఎస్పీ విజయ్‌బాబు

ఖమ్మం వైద్యవిభాగం: తలసేమియా రహిత సమాజం కసం పోలీసు శాఖ కృషి చేస్తోందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు వెల్లడించారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవం ఖమ్మంలోని రితన్య ఆస్పత్రి తలసేమియా డే కేర్ సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన ప్లే జోన్‌ను ఏఎస్పీ ప్రారంభించి మాట్లాడారు. సామాజిక దృక్పథంతో అందించే ప్రతీ రక్తపుబొట్టు జన్యుపరమైన లోపంతో బాధపడుతున్న చిన్నారులను జీవితాన్ని నిలబెడుతుందని తెలిపారు. ఈమేరకు ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు రక్తదానానికి ముందుకు రావాలని సూచించారు. ఇందులో సంకల్ప సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని చెప్పారు. బిలీఫ్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాజ్యోతి మాట్లాడగా ఏఆర్ ఏసీపీ నర్సయ్య, హోంగార్డ్ ఆర్ఐ సురేష్, వైద్యులు బి.రమేష్‌బాబు, డి.నారాయణమూర్తి, అనురాధ, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు పి.అనితతో పాటు పావని, పి.రవిచందర్, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ విజయ్‌బాబు